మందకొడిగా వంతెన పనులు

- కూలేందుకు సిద్ధంగా తాత్కాలిక వంతెన
- బిక్కుబిక్కుమంటూ ప్రజల రాకపోకలు

భీమడోలు: జాతీయ, రాష్ట్రీయ రహదారులకు కూడలిగా ఉన్న గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై 120 ఏళ్ల కితం నిర్మించిన వంతెన ఏడాదిన్నర కితం కూలింది. దీంతో కాల్వపై శాశ్వత వంతెన నిర్మాణానికి నాటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. నేషనల్ హైవే కాంట్రాక్ట్ శాఖ, ఇరిగేషన్‌ల శాఖల మధ్య సమన్వయం కొరవడంతో పనులు మందగొడిగా సాగాయి. అడుగడుగునా పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. గతేడాది డిసెంబర్‌లో వంతెన నిర్మాణంలో కీలక ఘట్టంగా ఉన్న మూడు గిడ్డర్లను ప్రజల ఆందోళన నడుమ బిగించారు. జనవరి రెండో వారంలోనే వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని సంబంధిత సివిల్ ఇంజినీరింగ్ అధికారులు హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి నెలరోజులు గడుస్తున్నా, ఆ తర్వాత చేపట్టాల్సిన శ్లాబు పనులు నేటికీ పూర్తికాలేదు. ఈనెలాఖరు నాటికి శ్లాబ్ పనులు పూర్తవుతాయని చెబుతున్నారు.

భయంభయంగా రాకపోకలు

జాతీయ రహదారికి అనుసంధానంగా గుండుగొలను గోదావరి కాల్వపై తాత్కాలికంగా నిర్మించిన బెయిలీ వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన అడుగు భాగంలోని ఇనుప ఊసలు పైకి లేచి వాహనదారుల పాలిట శాపంగా మారింది. పగలు, రాత్రి అధిక లోడు భారీ వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగించడం వల్లే వంతెన ప్రమాదస్థితికి చేరింది. అడుగున భారీ రంధ్రాలు పడడం, ఊసలు ఊడి ఇనుప ప్లేట్లు బలహీనంగా మారి వంతెనపై నడిచినా పెద్దపెద్ద శబ్దాలు వస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో వారి పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


గుండుగొలనులో బెయిలీ వంతెనపై పైకి లేచిన ఇనుప ఊస


శాశ్వత వంతెనకు శ్లాబ్ పనులు చేస్తున్న దృశ్యం

ఈ వంతెనపై 15 గ్రామాల ప్రజలను భయంభయంగా రాకపోకలుసాగిస్తున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనచోదరులు నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. శాశ్వత వంతెన నిర్మాణం కోసం తాత్కాలికంగా నిర్మించిన బెయిలీ వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. శాశ్వత వంతెన నిర్మాణ పనులు పూర్తి కాలేదు.

ప్రమాదాలకు నెలవు

శాశ్వత వంతెన నిర్మాణం పూర్తికపోవడంతో గుండుగొలను జంక్షన్‌లో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే 20కి పైగా రోడ్డు ప్రమాదాలు సంభవించగా, కొందరు మృతి చెందారు. ఈ వంతెనపై భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాలకు చెందిన వేలాది మంది ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి శాశ్వత వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తి దౌర్జన్యంపై కేసు

పెదవేగి: దౌర్జన్యం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. విజయవాడ లయోలా గార్డెన్స్‌కు చెందిన జాస్తి వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి పెదవేగి మండలం సూర్యారావుపేట గ్రామంలో 30 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ నిమిత్తం ఆగస్టు 2023లో పెదవేగి దిబ్బగూడెం గ్రామానికి చెందిన ఎం వసంతరావు అనే వ్యక్తిని గుమస్తాగా పెట్టుకున్నారు. ఈ భూముల్లో ఉన్న మూడు మోటర్లు, మూడు స్టార్టర్లు, కేబుల్ కత్తులు వసంతరావు తీసుకెళ్లి సొంతానికి దుర్వినియోగం చేశాడని, వీటిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేశాడని వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

పెదవేగి : భర్త వేధిస్తున్నాడంటూ ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం తాళ్లగోకవరం గ్రామానికి చెందిన ఎండీ నసీమాతో 2023వ సంవత్సరంలో కొవ్వూరు గ్రామానికి చెందిన ఖాదర్‌వల్లీతో వివాహమైంది. కొంతకాలం గడిచిన తర్వాత ఖాదర్‌వల్లి, అత్త ముంతాజ్ బేగం, మరిది దిల్షాద్దు, చోటతోటికోడలు కలిసి అధిక కట్నంకోసం నసీమాను శారీరంగా, మానసింగా హింసిస్తున్నట్టు తెలిపారు. నసీమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

వీరభద్రుని ఆలయ ఆధునికీకరణ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

దెందులూరు: మండలంలోని పోతునూరు ఉన్నత పాఠశాల సమీపంలో వీరభద్రుని ఆలయ ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శనివారం సముద్ర, నది, ఏరుల జలాలతో ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. కొత్తూరు మహిళలచే లలితా విష్ణు పారాయణం చేశారు. కోదండరామ భజన సమాజం ఉండ్రాజవరం వారు భజన కార్యక్ర మం నిర్వహించారు. బెజవాడ పల్లయ్య కుటుంబ సభ్యులు ప్రసాదాన్ని వితరణ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం రికార్డుల పరిశీలన


థీమ్ అంగన్‌వాడీ కార్యక్రమంలో శ్రీదేవి

దెందులూరు: థీమ్ అంగన్‌వాడీ కార్యక్రమం సక్రమంగా అమలుచేయాలని ఐసీడీఎస్ పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దెందులూరు మండలం పోతునూరు అంగన్‌వాడీ కేంద్రం నెంబర్–191లో థీమ్ అంగన్‌వాడీ పథకంపై కార్యకర్తలు, ఆయాలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. పిల్లలకు బరువులు పరీక్షలు చేశారు. పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం రికార్డులు పరిశీలించి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదం అంచున ఉండ్రాజవరం వంతెన


శిథిలావస్థకు చేరిన వంతెన

దెందులూరు: పోతునూరు శివారు ఉండ్రాజవరం వంతెన ప్రమాదం శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల క్రిందట నిర్మించిన ఈ వంతెనపై ఎనిమిది గ్రామాలు ప్రజలు, వాహనాలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. వంతెనకు రెండువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన కింద గోదావరి కాలువ ప్రవాహంతో ఉంది. వంతెనపై రెండువైపులా రక్షణ గోడ ఏర్పాటు చేయకపోతే కాలులోకి దూసుకుపోయే ప్రమాదం ఉంది. వెంటనే ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

లక్ష తులసీదళార్చన


వేణుగోపాలస్వామి

పెదపాడు : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామి వారికి లక్ష తుల సీదళార్చన నిర్వహించారు. అర్చకుడు వేదాంతం శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

బీసీలకు రాజ్యాధికారం అందించిన జగన్


వెంకట రమణను సత్కరిస్తున్న నాగరాజు

నిడమర్రు: ముఖ్యమంత్రిగా బీసీలకు రాజ్యాధికారం అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నౌడు వెంకటరమణ అన్నారు. పత్తేపురంలో ఆయన నివాసంలో పశ్చిమ గోదావరి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్నె నాగరాజుతో నౌడు సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు, జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి వైఎస్సార్ సీపీ బీసీ కార్యకర్తా కృషిచేసేలా జిల్లానుంచి వార్డు స్థాయివరకు ఓ ప్రణా ళిక సిద్ధం చేసుకోనేలా చర్చ జరిగింది. ఈ సందర్భంగా నౌడు రమణ మాట్లాడుతూ జిల్లాలోని శాసన సభ నియోజకవర్గాల్లో పార్టీ కన్వీనర్లతో చర్చించి అన్ని నియోజకవర్గాల్లో బీసీ కమిటీలు త్వరితగతిన ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. తొలుత మన్నె నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నౌడు రమణను మర్యాదపూర్వకంగా సత్కరించారు.

లక్ష్యాలకు అనుగుణంగా పశుగణన

దెందులూరు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పశుగణన నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ ఏలూరు జిల్లా జాయింట్ డైరెక్టర్ గోవిందరాజు అన్నారు. శనివారం కొవ్వలిలో ఆయన పశుగణనను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన చేస్తున్నట్టు చెప్పారు. 2024 డిసెంబర్‌లో ఈ సర్వే ప్రారంభమైందన్నారు. ఆవులు, గేదెలు గొర్రెలు, మేకలు, గుర్రాలు, గాడిదలు, అడవి గేదెలు, కోళ్లు, నాటు కోళ్లు, బాతులు, కుక్కలు తోపాటు 14 రకాల పశువులకు సంబంధించి గణన చేస్తున్నట్టు తెలిపారు. ఇది పరిశోధనతోపాటు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుకు దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో కొవ్వలి వైద్యశాలలో మండల పశువైద్య శాఖ అధికారి రామ్మోహనరావు, స్థానిక సిబ్బంది ఉన్నారు.


రైతులకు మందులు అందచేస్తున్న జేడీ గోవిందరాజు

అచ్చమ్మ పేరంటాలుకు విశేష పూజలు


అచ్చమ్మ పేరంటాలమ్మ


ద్రాక్ష పండ్ల అలంకరణలో స్వామివారు

దెందులూరు: గాలయిగూడెంలోని అచ్చమ్మ పేరంటాలు ఆలయ ఉత్సవాల్లో భాగంగా భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు భీష్మ ఏకాదశి పూజల్లో పాల్గొని ప్రదక్షిణలు చేశారు. ఉత్సవాల ఐదో రోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పెదవేగి సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ పోలీస్ సిబ్బంది ఉత్సవాల్లో బందోబస్తు నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని 11,200 ద్రాక్ష పండ్లతో గాలయిగూడెం భీమ నాగలింగేశ్వర స్వామివారికి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.


అమ్మవారిని దర్శించుకున్న సింగర్ నేహ

అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాల్లో సినీ సింగర్ స్నేహ ప్రేక్షకులను అలరించారు. విజయవంతమైన 22 తెలుగు సినిమాల్లో పాటలను గానంచేసి ఆకట్టుకున్నారు. తొలుత ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రామ దేవతల జాతర సందడి


భీమడోలులోని విద్యుత్ దీప కాంతులీనుతున్న మూడు ఆలయాలు


కాంతులీనుతున్న సంతమార్కెట్ ప్రాంత పరిసరాలు

భీమడోలు: భీమడోలు గ్రామదేవతలు మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుల జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణం, పరిసరాలు విద్యుత్ కాంతులతో ధగధగా మెరుస్తున్నాయి. 12 ఏళ్లకోసారి వచ్చే ఈ జాతరను నెల రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈనెల 7న గ్రామదేవతగా వీరాజిల్లుతున్న మద్ది రామమ్మను గోదావరి కాల్వ వద్ద నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. మూడు గుళ్లుగా పిలిచే అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. పరిసరాలు సైతం కిలో మీటర్ మేర కనులకు మిరిమిట్లు గొలిపేలా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాల సెట్టింగులు ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి ప్రతి రోజు అమ్మవార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో తగిన విధంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.


మద్దిరామమ్మ


మహాలక్ష్మమ్మ


గంగానమ్మ

సృజనాత్మకతను వెలికి తీయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కూడా పాఠశాల వేదిక కావాలని సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.సాయికుమారి శంకర్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో గ్రేడ్ 1, 2, 3 తరగతుల యాన్యువల్ కన్సర్ట్ వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా 2024 వెయిట్ లిఫ్టింగ్ జూనియర్ ఇండియా చాంపియన్ ఎ.కోమల్ కార్తీక్, అతిథులుగా విద్యా సంస్థల సెక్రటరీ ఎంబీఎస్‌వీ ప్రసాద్, కమిటీ సభ్యులు బీవీబీవీఎస్ చంద్ర భగవాన్ పాల్గొన్నారు. చిన్నారులు శాస్త్రీయ, స్వాగత నృత్యాలతో అలరించారు. సీసీఏ ఆక్టివిటీలు, ఎస్‌ఓఎఫ్ తదితర పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ఏలూరు (టూటౌన్): విద్యారంగాన్ని బలోపేతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న డిమాండ్ చేశారు. స్థానిక నరసింహారావు పేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగం రోజురోజుకు దిగజారుతుందని, ఐనా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తుతున్నట్టు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఏలూరు నగరంలో డిగ్రీ కళాశాల సొంత భవనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే చంటి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే డిగ్రీ కాలేజీ పనులు ప్రారంభించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ల్యాబ్స్ లేని కళాశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న

గ్రామాల్లో దోమల బెడద

- కాయిల్స్, లిక్విడ్‌లకు లొంగని వైనం
- నివారణ చర్యలు అంతంత మాత్రమే

పెదవేగి : వాతావరణం మార్పో, ఏమో గాని గ్రామాల్లో దోమల బెడద ఎక్కువైంది. సాయంత్రం నాలుగు గంటలు దాటితే బయటకొచ్చి ప్రజలపై దాడి చేస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు పేరుకుపోయి, భూమి తడిబారి ఎక్కువ రోజులు తేమ కారణంగా ఎక్కడిక్కడ దోమలు ఉత్పత్తి చెందేవి. మిగిలిన కాలాల్లో మురుగు కాలువలు, మురుగు పారని డ్రెయిన్ ప్రాంతాల్లో దోమల సమస్య ఉండేది. అయితే కొన్ని రోజులుగా అన్ని ప్రాంతాల్లోనూ దోమలు సమస్య ఎక్కువైందని గ్రామీణులు ఆందోళన చెందుతున్నారు. దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమల ద్వారా మలేరియా, బోద, డెంగీ, చికున్‌గున్యా, మెదడు వాపు తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఏర్పడింది పలు ప్రాంతాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా, పలు మురుగు నిలిచిపోయి, లారా కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి దోమ లు వృద్ధి చెందుతున్నాయి. గ్రామ పంచాయతీలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేయకపోవడం వల్ల దోమలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు గతేడాది పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లు సరఫరా చేశారు. కానీ వాటిని ఉపయోగిస్తున్నట్లు ఎక్కడా కనిపించలేదు. దానిపై ఆరా తీస్తే పంచాయతీల్లో తగినంత మంది పారిశుద్ధ్య సిబ్బంది లేక మందు పిచికారీ చేయడం లేదని, ఫాగింగ్ మెషీన్లు వినియోగించడం లేదని తెలుస్తోంది.


డ్రెయిన్ లేక రోడ్డుపై నిలిచిన మురుగునీరు


వంగూరు ప్రధాన రహదారిపై చెత్తా చెదారం

దోమ కుట్టిందా దద్దుర్లే

దోమ కుడితే చర్మం విపరీతమైన మంట పుడుతుంది. కుట్టిన చోట చర్మం మంట పుట్టి, దద్దుర్లు వస్తున్నాయని ప్రజలు వాపోయారు. దోమల నివారణకు రూ.100 వెచ్చించి మస్కిటో కాయిల్స్ వెలిగిస్తున్నా, లిక్విడ్ మెషీన్లు పెడుతున్నా దోమలు లొంగటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అమ్మపాలెంలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయిన దోమల నివారణకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రధానంగా డోన్లతో పాటు, స్లమ్ ఏరియాల్లో ఎబేట్ మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని తరచూ విస్తృతంగా చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– పులవర్తి దేవానంద్, దుగ్గిరాల గ్రామస్తుడు

జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలి

దోమే కదా కుట్టింది అని ఊరుకుంటే ఒక్కోసారి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పలు రకాల దోమలు కుట్టడం వల్ల తొలుత జ్వరం వస్తుంది. జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే పరీక్షలు చేయించుకుని తగిన వైద్య పొందాలి.

– డాక్టర్ మాధవి, ప్రాథమిక వైద్యశాల, పెదవేగి

బీజేపీ విజయంపై నేతల హర్షం

గణపవరం, ఉంగుటూరు, భీమడోలు : ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడం పట్ల బీజేపీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పిప్పర సెంటర్, కైకరం, అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్లలో సంబరాలు చేసుకున్నారు. నాయకులు కొయ్యా వెంకటసుబ్బారావు, ఇందుకూరి అశోకచక్రవర్తి, ఇందుకూరి రామకృష్ణం రాజు, వర్ధినీడి కపిరాజు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆయుర్వేద వైద్య విధానంలో అన్ని వ్యాధులకు చికిత్స ఉంటుందని, సైడ్ ఎఫెక్ట్‌లు లేని మందులు అందుబాటులో ఉంటాయని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు నగేష్ అన్నారు. శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో నగేష్ వైద్య బృందంచే ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 111 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారందరికీ మందులు అందజేశారు.